సాక్షి అనకాపల్లి

గురువారం | 23 | మార్చి | 2023



నూకాంబిక ఆలయంలో..

ఉగాది సందర్భంగా నూకాంబిక అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇచ్చారు. శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు చేశారు. 8లో



సాహిత్య మక్కువ

లెక్కల మాస్టారు సాహితీ సృజనలో అదరగొడుతున్నారు. ప్రవృత్తిగా రచనలు చేస్తూ అవార్డులు అందుకుంటున్నారు. 8లో



ముత్యాల తలంబ్రాలు వితరణ

సింహాచలం: అప్పన్న కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని శివశంకర్‌రాజు అనే భక్తుడు ముత్యాల తలంబ్రాలు వితరణగా ఇచ్చారు.

న్యూస్‌రీల్

ఉత్తమ రైతు రఘుకు ఉగాది పురస్కారం



గుంటూరులో వీసీ నుంచి అవార్డు అందుకుంటున్న రైతు రఘు

బుచ్చెయ్యపేట : మండలంలోని బంగారుమెట్టకు చెందిన రైతు సాయం రఘు రాష్ట్ర ఉత్తమ రైతుగా ఉగాది పురస్కారం దక్కించుకున్నారు. బుధవారం ఉగాది పర్వదినాన ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం గుంటూరులో జరిగిన వేడుకల్లో వైస్ చాన్సలర్ విష్ణువర్ధన్‌రెడ్డి చేతుల మీదుగా రఘు ఈ అవార్డును అందుకున్నారు. వ్యవసాయంలో ఆధునిక మెలకువలు పాటించి, సమగ్ర సస్య రక్షణ చేస్తూ, శాస్త్రీయ పద్ధతుల్లో అధిక పంట దిగుబడులు సాధించడంతో రఘును రాష్ట్ర ఉత్తమ రైతుగా ఎంపిక చేశారు. అవార్డు అందుకున్న రఘును మండల నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు అభినందించారు.

దంచికొట్టిన వాన



అనకాపల్లిలో జోరుగా కురుస్తున్న వర్షం

తుమ్మపాల : అనకాపల్లి పట్టణం, మండలంలో బుధవారం మధ్యాహ్నం వర్షం దంచికొట్టింది. దాదాపు మూడు గంటల పాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. రోడ్లపై తిరిగే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాలువలు, గెడ్డలు పొంగిపొర్లాయి. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వర్షం పడటం శుభసూచికంగా చెప్తున్నప్పటికీ, ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన టమాటాతో పాటు పలు పైర్లు దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వర్షాల నుంచి తేరుకోకముందే మళ్లీ వర్షం కురవడంతో పంట నష్టం మరింతగా పెరుగుతుందని వాపోతున్నారు. బుధవారం మధ్యాహ్నం అనకాపల్లిలో అత్యధికంగా 44.5 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు సీపీవో జి.రామారావు తెలిపారు. బుచ్చెయ్యపేట, పరవాడ, నర్సీపట్నం, మాడుగుల, సబ్బవరం, మాకవరపాలెం, రావికమతం మండలాల్లో అక్కడక్కడ 20.0 మి.మీ. నుంచి 27.5 మిల్లీమీటర్ల వరకు వర్షం పాతం నమోదైందన్నారు.

స్వర్ణాభరణ అలంకరణలో కనకమహాలక్ష్మి



డాబాగార్డెన్స్ (విశాఖ): బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని అమ్మవారిని స్వర్ణాభరణాలతో అలంకరించారు. బుధవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అమ్మవారు స్వర్ణాభరణాలు, పట్టుచీరలో దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. గణపతి పూజ, మండపారాధన అనంతరం ఎస్‌వీఎస్‌ఆర్‌కే ప్రసాద్ పంచాంగ పఠనం చేశారు. దేవదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దేవాలయంలో గల వేదపండితులు సీహెచ్‌ఎల్‌ఎన్ అవధానులు, ఎంవీ ఘనాపాఠి, అర్చకుడు బి.శేషుభట్టార్‌కి పండిత సత్కారం జరిగింది. కార్యక్రమంలో ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఊహ మహంతికి అంతర్జాతీయ గ్లోరీ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఊహ మహంతి

డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాలో అనేక స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ ఊహ మహంతికి మనం ఫౌండేషన్ ఇంటర్నేషనల్ గ్లోరీ అవార్డు ప్రకటించారు. బుధవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో విశాఖ సీబీఐ కోర్టు ప్రిన్సిపల్ జడ్జి సత్య వెంకట హిమబిందు చేతుల మీదుగా ఊహ మహంతి అవార్డు అందుకున్నారు. మారుమూల ప్రాంతాల పేదలకు విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని ప్రిన్సిపల్ జడ్జి సూచించారు. భవిష్యత్‌లో పేద గిరిజన బాలికల అభ్యున్నతికి మరింత కృషి చేస్తానని అవార్డు గ్రహీత పేర్కొన్నారు.

శోభ నిండుగా.. శుభాలు మెండుగా..



రాజగోపురం వద్ద పెళ్లిరాట వేస్తున్న భక్తులు, అధికారులు, అర్చకులు

శుభకృత్ శుభమంటూ సెలవు తీసుకుంది. శోభకృత్ శోభాయమానంగా మొదలైంది. కొత్త సంవత్సరం బాగుండాలని భగవంతుడిని ప్రార్థించి, ఉగాది పచ్చడి రుచి చూసి, పంచాంగ శ్రవణం చేసి, తెలుగు వారు రోజంతా సంప్రదాయబద్ధంగా గడిపారు. పలువురు ఆలయాలకు వెళ్లి దైవ దర్శనం చేసుకున్నారు. ఉపమాక వెంకన్న ఆలయం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. సింహాద్రి అప్పన్న కల్యాణోత్సవాలకు సంవత్సరాది రోజున పెళ్లిరాట వేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఉగాది వేడుకల్లో కలెక్టర్ పలువురు వేదపండితులను సన్మానించారు.

అప్పన్న పెళ్లికొడుకాయెనే



వెంకన్న, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అలంకరణలో కళాకారులు

సింహాచలం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి పెళ్లిరాట (ఉడుపురాట) ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని పెళ్లికుమారుడిగా అలంకరించి శ్రీదేవి, భూదేవి అమ్మవార్లతో సహా ఆలయ ఆస్థాన మండపంలో అధిష్ఠింపచేశారు. పంచాంగ పఠనాన్ని దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఘనంగా నిర్వహించారు. తదుపరి మహిళలు పసుపుకుంకుమలతో పెళ్లిరాటలను తీర్చిదిద్దారు. అనంతరం ఆలయ ఉత్తరద్వారం వద్ద, రాజగోపురం వద్ద, వార్షిక కల్యాణోత్సవం జరిగే నృసింహ మండపంలోను పెళ్లిరాటలను వేశారు. ఏప్రిల్ 2న వార్షిక కల్యాణోత్సవం జరగనుంది. దేవస్థానం పూర్వ అనువంశిక ధర్మకర్త పూసపాటి సుధాగజపతిరాజు, దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత, ట్రస్ట్‌బోర్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెళ్లిరాటని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి, గోదాదేవి అలంకరణలో కళాకారులు కనువిందు చేశారు. అలాగే ఆలయ రాజగోపురం వద్ద జరిగిన కోలాటం ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

అప్పన్న ఆదాయం 14, వ్యయం11

శ్రీ శోభకృత్‌నామ సంవత్సరంలో శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి ఆదాయం 14, వ్యయం 11గా పంచాంగం ప్రకారం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు పేర్కొన్నారు. స్వాతి నక్షత్రం, తులారాశి వాడైన శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామివారికి శుభకృత్‌నామ సంవత్సరంలో వ్యయం కన్నా ఆదాయం మెరుగ్గా ఉందని వివరించారు.

ఉపమాకలో ఉగాది ఆస్థానం





స్వామివారికి తిరుమంజనం నిర్వహించి నూతన వస్త్రాలు అలంకరించిన దృశ్యం, క్యూలో వేచి ఉన్న భక్తులు



గోదాదేవికి నూతన వస్త్రాలంకరణ

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాక వెంకన్న ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గరుడాద్రి పర్వతంపై కల్కి అవతారంలో వెలసిన మూలవిరాట్‌కు తెల్లవారుజామున పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయ శుద్ధి అనంతరం ప్రత్యేక తిరుమంజన కార్యక్రమం జరిగింది. అనంతరం కొండ దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామి ఆలయంలోను, స్వామివారి ఉత్సవమూర్తులు, ఆండాళ్లమ్మవారి సన్నిధిలో ఉపాలయాల్లో విశేష పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను, గోదాదేవిని, వేణుగోపాలస్వామిని నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. తెలుగు సంవత్సరాది కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున వచ్చారు. సాయంత్రం ప్రముఖ వేదపండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి పంచాంగ పఠనం చేశారు. ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉంటాయని, వర్షాలు సైతం విస్తారంగా కురుస్తాయన్నారు. దేవస్థాన ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

వేద పండితులకు సత్కారం



రుత్వికులను సత్కరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: కలెక్టరేట్‌లో బుధవారం శోభకృత్ నామసంవత్సర ఉగాది పర్వదినం ఘనంగా జరిగింది. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వేద పండితులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతీ సంప్రదాయాలు చాలా ఉన్నతమైనవని, ఉగాది పచ్చడి షడ్రుచుల సమ్మేళనమని, జీవితంలో కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలన్న సందేశం అందులో ఇమిడి ఉందన్నారు.

వేద పండితులు సుదర్శనం నారాయణచార్యులు (యలమంచిలి), వెలపలపల్లి శంకరం (కశింకోట), పేరూరు నారాయణరావు (అనకాపల్లి)లను శాలువాలతో సత్కరించి రూ.10,116 చొప్పున చెక్కు, సన్మాన పత్రాలను అందించారు. ఉగాది పచ్చడిని అందరికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ, జిల్లా దేవదాయ అధికారి బి.మహలక్ష్మినగేష్ పాల్గొన్నారు.

జీ-20 సమ్మిట్.. విశాఖకే తలమానికం



- సదస్సులో ప్రజలు భాగస్వాములు కావాలి
- నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలి
- సుందరీకరణ పనులు 90 శాతం పూర్తయ్యాయి
- 'సాక్షి'తో మేయర్ గొలగాని హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్ (విశాఖ): విశాఖ నగరంలో జీ-20 సదస్సు నిర్వహించడం గర్వకారణంగా భావిస్తున్నట్టు మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. జీ-20 సమ్మిట్ ఏర్పాట్లు, అతిథులు, పర్యాటకులకు కల్పించిన సౌకర్యాలపై బుధవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. 'విశాఖ కీర్తిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇక్కడి ప్రజలు తరఫున కృతజ్ఞతలు. జీ- 20 నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడతున్న చర్యలు అద్భుతం. ఈ సదస్సుకు దాదాపు 40 దేశాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. వారికి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకున్నాం. శీలానగర్ నుంచి ఎన్‌ఏడీ, తాటిచెట్లపాలెం, తెలుగుతల్లి ఫ్లైఓవర్ వరకు కోట్లాది రూపాయలతో సుందరీకరణ పనులతో పాటు రోడ్లు, విద్యుత్ అలంకరణ, ఆకర్షణీయమైన పెయింటింగ్ పనులు చేపట్టాం. సాగరతీరం కోస్టల్ బ్యాటరీ నుంచి రాడిసన్ హోటల్ వరకు విశాఖ తీర అందాలు అతిథులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాం. ఆర్.కె.బీచ్, సాగర్ నగర్, గుడ్లవానిపాలెం, సీతకొండ తదితర ప్రాంతాల్లో వ్యూ పాయింట్లను అతిథులు మెచ్చే విధంగా ఆకర్షణీయంగా రూపొందించాం. ప్రాంతాలు తెలిపే సూచిక బోర్డుల ఏర్పాటు, వేలాడుతున్న కేబుల్ వైర్లను తొలగించాం. వ్యర్థాలు ఎక్కడా లేకుండా అన్ని చర్యలు చేపట్టాం. దేశ ఔన్నత్యాన్ని చాటే విధంగా పలు ప్రాంతాలను తీర్చిదిద్దాం' అని మేయర్ వివరించారు.

ప్రజల భాగస్వామ్యం కావాలి

'జీ-20 సదస్సు విశాఖకే తలమానికం. విశాఖ నగర పౌరులుగా గొప్ప కార్యక్రమంలో భాగస్వాములవుదాం. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా పరిశుభ్రంగా ఉంచుదాం. దేశ విదేశీ ప్రతినిధులకు మన సంస్కృతి, సంప్రదాయాలను చూపిద్దాం' అని మేయర్ పిలుపునిచ్చారు. ఈ సదస్సు ఉద్దేశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆమె వివరించారు. 'యోగా ఆల్' పేరిట వైఎస్సార్ సెంట్రల్ పార్క్, వుడా పార్కులో యోగా తరగతులు నిర్వహించాం. 'మాక్ జీ-20 కాన్‌క్లేవ్' పేరిట బుధవారం విద్యార్థులతో సదస్సు చేపట్టాం. 24న సాగరతీర స్వచ్ఛత పేరిట బీచ్ క్లీనింగ్, 25న చిత్రలేఖనం పోటీలు, 26న వైజాగ్ సిటీ మారథాన్, వైజాగ్ కార్నివాల్ పేరిట థింసా, కోలాటం, వీర నాట్యం, కూచిపూడి వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేశాం. 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి హాజరయ్యే ప్రతినిధులు ముడసర్లోవలోని సోలార్ ప్రాజెక్టు, కాపులుప్పాడలోని జిందాల్ రీసైక్లింగ్ ప్లాంట్, జీవీఎంసీలోని కమాండ్ కంట్రోల్ ఆపరేషన్, తాగునీటి ప్రాజెక్టు, కైలాసగిరి, ఆర్కేబీచ్ తదితర ప్రాంతాలను తిలకించనున్నారు' అని మేయర్ తెలిపారు.

కోట్లాది రూపాయలతో నగర సుందరీకరణ

'రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జీ-20 సదస్సుకు సంబంధించి కోట్లాది రూపాయలతో చేపట్టిన సుందరీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. జోన్-1 పరిధిలో రూ.412.86 లక్షలతో 20 పనులు, జోన్-2 పరిధిలో రూ.1353.77 లక్షలతో 73 పనులు, జోన్-3 పరిధిలో 1371.62 లక్షలతో 59 పనులు, జోన్-4 పరిధిలో 1908.65 లక్షలతో 35 పనులు, జోన్-5 పరిధి-ఏలో 752.44 లక్షలతో 33 పనులు, బిలో రూ.169.91 లక్షలతో 11 పనులు, జోన్-8 పరిధిలో రూ.1908.89 లక్షలతో 27 అభివృద్ధి పనులు ప్రారంభించాం. ఇందులో దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. విద్యుత్‌కు సంబంధించి రూ.1168.47 లక్షలతో 56 పనులు, మెకానికల్‌కు సంబంధించి 287.41 లక్షలతో 4 పనులు, పీడీ-1కి సంబంధించి రూ.932.25 లక్షలతో 12 పనులు, పీఎల్ అండ్ సీకి సంబంధించి రూ.878.99 లక్షలతో 53 పనులు జరుగుతున్నాయి. మొత్తంగా ఇప్పటి వరకు 70 శాతం పైబడి పనులు పూర్తయ్యాయి'అని మేయర్ వివరించారు.

కళలను కాపాడుకుందాం



జోగినాయుడును సత్కరిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ అనిత దంపతులు, తదితరులు

మాకవరపాలెం: తెలుగు కళలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాత్రి గౌతమి లలిత కళా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది పురస్కార వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత మాట్లాడుతూ కళలను ప్రోత్సహిస్తూ ఏటా ఉగాది వేడుకలు నిర్వహిస్తున్న లలిత కళా శిక్షణ కేంద్రం వారిని అభినందించారు. అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందిస్తున్న వారికి ఉగాది పురస్కారాలు అందించి సత్కరించారు. ఈ వేడుకల్లో చిన్నారులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్ జోగినాయుడు, ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, నర్సీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, ఇమానుయేలు సంస్థ డైరెక్టర్ జీవన్‌రాయ్, వైస్ ఎంపీపీ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నేతలు భద్రాచలం, హరిబాబు ప్రసంగించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్రం అధ్యక్ష, కార్యదర్శులు రంగరాజు, శేషగిరిరావు, సభ్యులు రఘురాజు, ఆదినారాయణ, రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో 11 సెంట్రల్ బ్యాంక్ బ్రాంచ్‌ల ఏర్పాటు



అంకంరెడ్డి పార్వతిని సత్కరిస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత

- 27న డీసీసీబీ డైరెక్టర్‌గా అంకంరెడ్డి పార్వతి ప్రమాణ స్వీకారం
- మీడియాతో డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత

నాతవరం : ఉమ్మడి విశాఖపట్నం సెంట్రల్ బ్యాంకు వివిధ రుణాల కింద రూ.2 వేల కోట్లకు పైగా టర్నోవర్ సాధించిందని డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత వెల్లడించారు. డీసీసీబీ డైరెక్టర్‌గా నియమితులైన దివంగత నేత అంకంరెడ్డి జమీలు భార్య అంకంరెడ్డి పార్వతిని నాతవరంలో బుధవారం కలిసి, అభినందించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ డీసీసీబీ ద్వారా రైతులకు కావాల్సిన అన్ని రకాల రుణాలు అందిస్తున్నట్టు తెలిపారు. రైతుల అభీష్టం మేరకు రుణ లక్ష్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉమ్మడి జిల్లాలో మరో 11 సెంట్రల్ బ్యాంకు బ్రాంచ్‌లను త్వరలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వీటిని ప్రారంభిస్తామన్నారు. దివంగత అంకంరెడ్డి జమీలు ఆశయం మేరకు నాతవరంలో కొత్తగా సెంట్రల్ బ్యాంక్ బ్రాంచి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గతంలో కూడా ఆయన విజ్ఞప్తి మేరకు సెంట్రల్ బ్యాంక్ ఏటీఎం కేంద్రాన్ని నాతవరంలో ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త డైరెక్టర్‌గా నియమితులైన పార్వతి ఈ నెల 27న విశాఖపట్నంలో ప్రమాణస్వీకారం చేస్తారని తెలిపారు. అదే రోజు డీసీసీబీ పాలకవర్గ సమావేశం కూడా ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దివంగత నేత జమీలు అందించిన సేవలను పార్టీ ఎప్పుడూ గుర్తుంచుకుని, ఆయన కుటుంబ సభ్యుల్ని గౌరవిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యురాలు కరక రేణుక, మాజీ సర్పంచ్ కామిరెడ్డి కిత్తయ్యనాయుడు, వెదురుపల్లి సర్పంచ్ కాళ్ల సత్యనారాయణ, వర్తక సంఘం అధ్యక్షుడు తూతిక నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో శుద్ధ జలం





వి.మాడుగుల-1 అంగన్‌వాడీ కేంద్రం (ఇన్‌సెట్) అనకాపల్లి ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన మినీ ఆర్వో ప్లాంటు

- మినీ ఆర్వోప్లాంట్లు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం
- శాశ్వత భవనం ఉన్న వాటికి తొలి ప్రాధాన్యం
- జిల్లాలో ఇటీవల 506 చోట్ల ఏర్పాటు
- ఒక్కో ప్లాంట్‌కు రూ.24 వేలు ఖర్చు

అనకాపల్లి రూరల్: మాతా, శిశు సంరక్షణలో కీలకంగా సేవలందిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలకు శుద్ధ జలం సమకూర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటి వరకు స్థానికంగా ఉండే బావులు, బోర్లతోపాటు, బాటిల్ నీళ్లను చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నారు. ఆయా కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు పోషకాలతో కూడిన భోజనం వడ్డిస్తున్నారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ఇస్తున్నారు. వీటితో పాటు సురక్షిత తాగునీటిని వీరందరికీ అందించడానికి ప్రత్యేకంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నారు. వర్షాకాలంలో కలుషిత నీరు తాగకుండా, వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా జిల్లాలో 506 కేంద్రాల్లో ఇటీవల వీటిని ఏర్పాటు చేశారు. శుద్ధ జలంతో చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కాపాడాలని ఉన్నత స్థాయిలో నిర్ణయించడంతో కేంద్రం సాక్ష్యం పథకం కింద మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసింది. శాశ్వత భవనాలున్న కేంద్రాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చారు. విడతల వారీగా జిల్లాలో అన్ని కేంద్రాలకు శుద్ధ జలం అందజేయనున్నారు.

తొలివిడతలో సొంత భవనాలున్నచోట..

జిల్లాలో 1908 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో సొంత భవనాల్లో 819, అద్దె భవనాల్లో 662 కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇతర భవనాల్లో 427 కేంద్రాలున్నాయి. మొత్తం 87,327మంది పిల్లలున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయడంతో పిల్లలు, గర్భిణులకు సురక్షిత నీరు అందించే అవకాశం ఏర్పడిందని స్త్రీ,శిశు సంక్షేమ అధికారులు చెబుతున్నారు.

ఒక్కో ప్లాంట్‌కు రూ.24 వేలు

ఒక్కో ఆర్వోప్లాంట్‌లో 15 లీటర్ల సామర్థ్యం గల ట్యాంకును అమర్చారు. ఇది గంటకు 12 లీటర్ల నీటిని శుద్ధి చేస్తుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో నీటి సదుపాయం ఉంటే నేరుగా పైపులు ఏర్పాటు చేశారు. ఆ సదుపాయం లేని చోటికి నీటిని తెచ్చి ప్లాంట్‌లో పోసేలా ఏర్పాట్లు చేసుకున్నారు. మినీ ఆర్వోప్లాంట్లు ఏర్పాటు బాధ్యతను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. ఒక్కో ప్లాంట్ ఏర్పాటుకు రూ.24 వేలు ఖర్చవుతున్నట్టు అధికారులు తెలిపారు.

దశలవారీగా..



అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు శుద్ధి చేసిన తాగునీరు సరఫరా చేస్తున్నాం. మొదటి విడతగా సొంత భవనాలున్నచోట ప్లాంట్లు ఏర్పాటు చేశాం. దశలవారీగా మిగతా చోట్ల అమర్చేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. మినీ ఆర్వో ప్లాంట్లతో రక్షిత తాగునీరు అందుబాటులో ఉంటుంది.

-జి.ఉషారాణి, మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి

క్లుప్తంగా

మోదమాంబ, మెట్రో సీసీ జట్ల విజయం

విశాఖ స్పోర్ట్స్: యూసీసీ టీ20 క్రికెట్‌లో భాగంగా మోదమాంబ జట్టు మెట్రోసీసీ జట్లు విజయం సాధించాయి. వైఎస్సార్ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన గాజువాక గ్రీన్స్ ఆరు వికెట్లకు 167 పరుగులు చేసింది. ప్రతిగా మోదమాంబ జట్టు మరో రెండు బంతులుండగానే తొమ్మిది వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. సింహాద్రి 74పరుగులు చేశాడు. అప్పన్న నాలుగు వికెట్లు తీశాడు. మరో మ్యాచ్‌లో యలమంచిలి సీసీ 13.2 ఓవర్లలో 44 పరుగులకే ఆలౌటైంది. ప్రతిగా మెట్రోసీసీ వికెట్ కోల్పోకుండానే విజయాన్నందుకుంది. పోటీల ప్రారంభ కార్యక్రమంలో ఏసీఏ సీఈవో శివారెడ్డి ట్రోఫీలు అవిష్కరించారు.

విశాఖలో విస్తృత తనిఖీలు



ముడసర్లోవ వద్ద కే-9 స్నిఫర్ డాగ్స్‌తో తనిఖీ చేస్తున్న సిబ్బంది

అల్లిపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జీ-20 సదస్సు నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు వీవీపీలు సందర్శించే ప్రదేశాలలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. కే-9 స్నిప్పర్ డాగ్స్ టీమ్స్, యాంటీ సాబొటేజ్ చెక్ టీమ్స్‌తో ముడసర్లోవ పార్కు, కై లాసగిరి హిల్స్, రాడిసన్ బ్లూ హోటల్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

'లెక్క'కు మించిన సాహిత్య మక్కువ

సంకలనం, వ్యవకలనం, గుణకారం, భాగహారం నేర్పే ఆ ఉపాధ్యాయుడు కవితా సంకలనాలు వెలువరిస్తున్నారు. లెక్కల ఉపాధ్యాయుడే అయినా తెలుగు భాషపై మక్కువతో రచనలు కొనసాగిస్తున్నారు. అమృతం లాంటి కవిత్వాన్ని వెలువరిస్తూ సార్థకనామధేయుడిగా పేరు తెచ్చుకుంటున్నారు ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్న జుంజూరి అమృతరావు. వృత్తి రీత్యా లెక్కలు బోధిస్తున్నా... ప్రవృత్తి రీత్యా సాహిత్య రంగంలో కృషి చేస్తూ మన్ననలు పొందుతున్నారు.


రాజశ్రీ అవార్డును ప్రభుత్వ విప్ బూడి చేతుల మీదుగా అందుకుంటున్న అమృతరావు

- రచనా వ్యాసంగంతో పాటు విరివిగా సేవా కార్యక్రమాలు
- ప్రశంసలు అందుకుంటున్న
- గణిత ఉపాధ్యాయుడు అమృతరావు

కె.కోటపాడు : ఎ.కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న జుంజూరి అమృతరావు చిన్నప్పటి నుంచే సాహిత్యంపై ఉన్న మక్కువతో రచనలు చేస్తూ అవార్డులు, ప్రతిభా పురస్కారాలను పొందుతున్నారు.

తెలుగు మాస్టారు స్ఫూర్తితో..

పెదబయలు రెసిడెన్షియల్ పాఠశాలలో చదివిన అమృతరావును అక్కడి తెలుగు మాస్టారు డాక్టరు మురళీకృష్ణ ప్రసంగాలు, ఆయన కవితలు ఆకర్షించాయి. దీంతో అప్పటి నుంచి తెలుగు భాష, సాహిత్యంపై ఆసక్తి చూపిన అమృతరావు రచనలు కొనసాగిస్తున్నారు.

సేవా కార్యక్రమాలు

ఉపాధ్యాయ వృత్తిలో ఉంటున్నా అమృతరావు సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ పలువురి మన్నలను పొందుతున్నారు. పేద విద్యార్థులకు అవసరమైన ఆర్థికసాయాన్ని అందిస్తున్నారు. కరోనా సమయంలో పోలీసులు, వైద్య సిబ్బందితో పాటు పాదచారులకు భోజనాలు, మంచినీరు, కూరగాయలను తన సొంత నిధులతో సమకూర్చారు.

ప్రశంసలు, పురస్కారాలు

- స్విట్జర్లాండ్, జెనీవాకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ పీస్ సంస్థ నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.
- 108 వచన కవితలను రాసి 2021లో మంచిర్యాలకు చెందిన అఖిల భారత సాహిత్య పరిషత్ నిర్వహించిన వచన కవితల పోటీల్లో ప్రత్యేక ప్రశంసతోపాటు రాజశ్రీ బిరుదు పొందారు. ఈ ప్రశంసా పత్రాన్ని ఎ.కోడూరు పాఠశాలలో ప్రస్తుత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చేతుల మీదుగా అమృతరావు అందుకున్నారు.
- అఖిల భారత సాహిత్య పరిషత్ వారు విజయదశమిపై నిర్వహించిన కార్యక్రమంలో ద్వితీయ స్థానం లభించింది.
- నెల్లూరుకు చెందిన గోవిందరాజులు సీతాదేవి సాహిత్య వేదిక నిర్వహించిన కవితా పోటీల్లో ప్రథమస్థానం లభించింది.
- హైదరాబాద్ ఉస్మానియా తెలుగు రచయితల సంఘం వారు గుర్రం జాషువాపై నిర్వహించిన కవితల పోటీల్లో, రాజమండ్రిలో గోదావరి రచయితల సంఘం వారు అంతర్జాతీయ తపాలా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కవితా పోటీల్లో ప్రశంసలు పొందారు.
- అమృతరావు రాసిన కవితలు బుక్ ఆఫ్ థండర్-20 పుస్తకంలోను, గాంధీ జయంతి కవితా సంకలనంలో చోటు దక్కించుకున్నాయి.
- సమాజ సేవలో ఉన్న కవులకు, రచయితలకు విశాఖపట్నంలో ఈ ఏడాది ఆదరణ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఇచ్చిన అవార్డుల ప్రదానోత్సవంలో అమృతరావుకు విశిష్ట సేవారత్న పురస్కారం లభించింది.


కరోనా లాక్‌డౌన్ సమయంలో పోలీసులకు ఆహారం, తాగునీటిని అందిస్తున్న అమృతరావు

చిన్నప్పటి నుంచి ఆసక్తి



విద్యార్థి దశ నుంచి తెలుగు సాహిత్యంపై మక్కువ ఏర్పడింది. తెలుగు ఉపాధ్యాయుడు మురళీకృష్ణ స్ఫూర్తితోనే కవితలపై ఇష్టం పెరిగింది. గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నా ఖాళీ సమయాల్లో కవితలు రాయడం అవాటుగా మారింది.

–జుంజూరి అమృతరావు, ఉపాధ్యాయుడు, ఎ.కోడూరు.

నూకాంబిక ఆలయంలో ఘనంగా ఉగాది వేడుకలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు


క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

- ప్రత్యేక అలంకరణలో అమ్మ దర్శనం
- ఆలయానికి పోటెత్తిన భక్తులు
- శ్రీచక్రానికి ప్రత్యేక పూజలు

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర ఆరాధ్యదైవం గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ మండలంలో శ్రీ చక్రానికి అర్చకులు రేజేటి చక్రవర్తి ప్రత్యేక పూజలు చేసి, పంచాంగ శ్రవణం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ సుజాత పర్యవేక్షణలో ఆలయ అధికారులు సౌకర్యాలు కల్పించారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

అమ్మవారిని ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి వరహా సత్యవతి, అగ్నిమాపక శాఖ డీఎఫ్‌వో లక్ష్మణస్వామి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు దంపతులు, సీఐలు రవికుమార్, శ్రీనివాసరావులు దర్శించుకున్నారు. ఉగాది వేడుకల్లో ఆలయ ఈవో చంద్రశేఖర్, 80వవార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కరరావు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ కోసం ఘర్షణ.. ఒకరి మృతి

- ఫిషింగ్ హార్బర్‌లో ఘటన

అల్లిపురం: సెల్‌ఫోన్ కోసం ముగ్గురి మధ్య జరిగిన ఘర్షణలో ఒకరి ప్రాణం పోయింది. వన్‌టౌన్ పరిధి ఫిషింగ్ హార్బర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వన్‌టౌన్ సీఐ రేవతి తెలిపిన వివరాలివీ.. ఫిషింగ్ హార్బర్ రెండవ నంబర్ జెట్టీలో మంగళవారం రాత్రి ఓ బోటులో ఆ బోటు డ్రైవర్, ఇద్దరు వాచ్‌మెన్ కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో వారి మధ్య సెల్‌ఫోన్ కోసం గొడవ జరిగింది. గొడవ క్రమంగా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ ఘటనలో బోటు డ్రైవర్ కంబాల దేవుడు (48)కి తీవ్రగాయాలయ్యాయి. మిగిలిన ఇద్దరు కొట్టిన దెబ్బలను తట్టుకోలేక దేవుడు మరో బోటులోకి వెళ్లి తలదాచుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు అతన్ని కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ దేముడు బుధవారం మృతి చెందాడు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారించారు. కంబాల దేముడుది అచ్యుతాపురం మండలం, పూడిమడక గ్రామంగా గుర్తించారు. అతనిపై దాడికి పాల్పడిన ఇద్దరిది భీమిలి మండలం, అన్నవరం. నిందితులిద్దరూ పరారీలో ఉన్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

ముగిసిన ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు

అనకాపల్లి టౌన్: స్థానిక వి.వి.రమణ రైతుభారతి ఓపెన్ ఆడిటోరియంలో జ్యోతిసరళ స్మారక కళా పరిషత్, 1975 ఎంహెచ్ స్కూల్ పూర్వవిద్యార్థుల సహకారంతో నిర్వహించిన ఉమ్మడి ఏపీ ద్వితీయ ఆహ్వాన నాటిక పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ పరిషత్ ఏర్పాటు ద్వారా కళాకారులకు జీవనోపాధి కల్పిస్తున్న కళా పరిషత్ కార్యదర్శి పి.సిహెచ్.నాయుడు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.


కొత్తపరిమళం నాటికలో సరిహద్దులో ఆర్మీ సైనికులు

ఆకట్టుకున్న 'కొత్తపరిమళం'

శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రదర్శించిన కొత్త పరిమళం నాటిక ఆద్యంతం ఆలోచింపజేసింది. ఇండియా–పాకిస్థాన్ సరిహద్దు ప్రాంతంలో యుద్ధ భయంతో ప్రజలు అల్లాడిపోతుంటే.. మరో పక్క మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోతుంది. జాతి, మతద్వేషాలతో దేశాలు రగిలిపోతున్న నేపథ్యంలో వాటి మధ్య నలిగిపోతున్న సరిహద్దు ప్రజల జీవితాలను ఈ నాటికలో ఆవిష్కరించారు. ఈ నాటికకు కథ కార్తీకుల శ్రీనివాసరావు అందించగా కె.కె.ఎల్.స్వామి దర్శకత్వం వహించారు. పిరియా చలపతి, శోభన్‌బాబు, చలం తదితరులు తన నటనతో నాటకాన్ని రక్తికట్టించారు.

ఉత్కంఠభరితంగా 'పక్కింటి మొగుడు'

పండు క్రియేషన్స్ కొప్పోలు వారిచే ప్రదర్శించిన పక్కింటి మొగుడు నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. భార్యాభర్తల సఖ్యతగా ఉంటేనే తన ఆస్తి మనుమలకు దక్కుతుందంటూ ఓ తాతా, బామ్మ వీలునామాలో చూపిన రూ.2 కోట్ల ఆస్తిని వారికివ్వడానికి ఓ లాయర్ వస్తాడు. అప్పటి నుంచి జరిగిన సన్నివేశాలు చాలా ఆసక్తిగా సాగాయి.

గాయపడిన మహిళ మృతి

అనకాపల్లిటౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు రూరల్ హెడ్‌కానిస్టేబుల్ కె.డి.ఎస్.ఎ.రాజు చెప్పారు. హెచ్‌సీ కథనం మేరకు వివరాలు... విశాఖకు చెందిన వంగలపూడి మంగవేణి(57) ఈనెల 15న తమ కుమార్తె ఫంక్షన్ నిమిత్తం విశాఖ నుంచి కశింకోటకు బి.కిరణ్ ద్విచక్రవాహనంపై వెళుతుండగా మండలంలో కొప్పాక జంక్షన్ వద్ద బైక్ నుంచి జారి పడిపోయింది. ఈ ప్రమాదంలో మంగవేణి తలకు తీవ్రగాయం కావడంతో అనకాపల్లి ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు మృతుని కుమారుడు సాయిరమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ చెప్పారు.

అఘోరాల ముసుగులో హల్చల్

నర్సీపట్నం: అఘోరాల ముసుగులో పలువురు నర్సీపట్నంలో హల్‌చల్ చేశారు. ఆరు నెలల క్రితం ఇదే విధంగా అఘోరాల మంటూ సన్యాసులు మద్యం సేవించి పట్టణంలో వీరంగం సృష్టించి, ప్రజలను భయాందోళనకు గురి చేశారు. ఉగాది పండగ రోజున మరోసారి తప్పతాగి ఒంటి మీద బట్టలు లేకుండా అఘోరాల మంటూ పట్టణంలో మరోసారి హల్‌చల్ చేశారు. మెయిన్‌రోడ్డుపై వెళ్లే వాహనాలను అడ్డగించి వాహనదారుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేశారు. డబ్బులు ఇవ్వని వాహనాలను కదలనివ్వలేదు. వారి వికృత చేష్టలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అయ్యో...పా(ప)ము


ఫెన్సింగ్‌కు తాడుతో బంధించిన పాము

నర్సీపట్నం : పట్టణంలో ఆర్డీవో కార్యాలయం బయట మెయిన్ రోడ్డును అనుకొని ఉన్న ఇనుప కంచెకు ప్రాణంతో ఉన్న పామును తాడుతో గుర్తు తెలియని వ్యక్తులు బంధించారు. సుమారు నాలుగు అడుగుల పొడవు, బలమైన పొడపామును ఎవరో తీసుకు వచ్చి ప్లాస్టిక్ తాడుతో పాము మెడను బంధించి కంచికి కట్టేసి వదిలేశారు. తాడుతో కట్టేయడంతో పాము బంది అయింది. మెయిన్ రోడ్డు పక్కన ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న పామును ప్రజలు ఆసక్తి చూసారు. పాము బతికి ఉండగానే నరకం చూసింది.

నేడు జాబ్‌మేళా

ఎంవీపీకాలనీ: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఉపాధి కల్పన మిషన్ (సీడాప్), డిస్ట్రిక్ట్ ఎంప్లాయిమెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ జాబ్‌మేళా ద్వారా 10 కంపెనీల్లో 417 ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. హనీగ్రూప్, రిలయన్స్, అపోలో, మెడ్‌ప్లస్, మ్యాక్స్, రిలయన్స్ డిజిటల్స్, స్పెన్సర్, ఖజానా జువలరీస్, వరుణ్ మోటార్స్, రిలయన్స్ ఫుడ్‌ప్రింట్స్ కంపెనీల్లో ఖాళీల భర్తీకి కోసం నిర్వహించనున్న ఈ మేళా పెందుర్తిలోని జిల్లా సమైక్య భవన్‌లో ఉదయం 10 గంటలకు జరగనుంది. వివరాలకు 73867 13880 నంబర్‌లో సంప్రదించవచ్చు.

నేటి నుంచి ఉక్కు అధికారులు నల్లబ్యాడ్జీల నిరసన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులు గురువారం నుంచి నల్ల బ్యాడ్జీల నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఉక్కు అధికారుల పెండింగ్ సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో వారు నిరసన బాట పట్టారు. ఉక్కు అధికారుల పదోన్నతులను సత్వరమే విడుదల చేయాలని, 2021–22లో లాభాలు వచ్చినందున అధికారులకు ఇవ్వాల్సిన పీఆర్పీ వెంటనే ఇవ్వాలని, 2017 నుంచి అమలు చేయాల్సిన వేతన సవరణ వెంటనే చేయాలని, వేతన ఒప్పందంలో భాగంగా పెన్షన్ బకాయిలు వెంటనే ట్రస్ట్ ఖాతాల్లో జమ చేయాలన్న డిమాండ్లపై ఈ కార్యక్రమం చేపట్టారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అధికారులంతా బ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహిస్తారని ఉక్కు అధికారుల సంఘం (సీ) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాటం చంద్రరావు, కె.వి.డి. ప్రసాద్ తెలిపారు.

గంజాయి కేసులో ఆరుగురి పట్టివేత

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలో నెల్లూరుకు చెందిన యువకుల వద్ద గంజాయికి సంబంధించిన కేసులో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్ఐ సన్యాసినాయుడు తెలిపారు. వీరు అనకాపల్లి ఫ్లై ఓవర్ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్టు సమాచారం ఉందని ఆయన తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చెప్పారు.

మోదమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

సాక్షి,పాడేరు: ఉగాది పండగను జిల్లాలో అన్ని వర్గాల భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని అన్ని ఆలయాల్లోను భక్తుల తాకిడి నెలకొంది. ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పాడేరులోని మోదకొండమ్మతల్లి ఆలయానికి వేకువజామునుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం మోదమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. ఎస్పీ సతీష్‌కుమార్,ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు,ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలంనాయుడు తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం నుంచి భక్తులు తాకిడి అధికమైంది. మాజీ మంత్రి మణికుమారి సమకూర్చిన పులిహోర, ఇతర ప్రసాదాలను పంపిణీ చేశారు.

సింహగిరికి ఉగాది శోభ

- విశేషంగా నిత్య కల్యాణం
- భక్తులతో కిటకిటలాడిన అప్పన్న ఆలయం


నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: సింహగిరి బుధవారం ఉగాది శోభను సంతరించుకుంది. శ్రీ శోభకృత్‌నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని భక్తులు సింహగిరికి పోటెత్తారు. క్యూలో బారులు తీరి వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఉగాది సందర్భంగా స్వామివారి ఆలయంతో పాటు ఆస్థానమండపం..కల్యాణమండపాన్ని పుష్పాలతో అలంకరించారు. అలాగే భక్తులందరికీ దర్శనానంతరం ఉగాది పచ్చడి అందజేశారు. సింహగిరిపై ఉన్న త్రిపురాంతకస్వామి, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో కూడా భక్తుల రద్దీ కొనసాగింది.

విశేషంగా నిత్య కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కార్యక్రమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకుడు శ్రీకాంతాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.



స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు


పుష్పాలంకరణలో అప్పన్న ఆలయం


సరకు రవాణాలో 'వాల్తేరు' సూపర్ హిట్!

- వార్షిక సంవత్సరం ముగియకుండానే చేరుకున్న లక్ష్యం
- 2022–23 మార్చి 20 నాటికి 66.92 మిలియన్ టన్నుల లోడింగ్

సాక్షి, విశాఖపట్నం : వాల్తేరు డివిజన్.. ఏటా మాదిరిగానే ఈసారి కూడా సరకు రవాణాలో సూపర్‌హిట్ కొట్టింది. సరకు రవాణా విషయంలో గణనీయంగా వృద్ధి సాధిస్తూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని ముందుగానే దాటేసింది. మార్చి 20 నాటికి రికార్డు స్థాయిలో 66.92 మిలియన్ టన్నుల లోడింగ్ సామర్థ్యాన్ని చేరుకుంది. బొగ్గు, ఐరన్ ఓర్, బాక్సైట్, అల్యూమినా పౌడర్, ఐరన్ స్టీల్, లైమ్‌స్టోన్, ఫెర్టిలైజర్స్, పోల్, కంటైనర్లతో పాటు ఇతర సరకుల లోడింగ్‌తో ఈ రికార్డు లోడింగ్ సాధ్యమైంది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి వాల్తేరు డివిజన్ చరిత్రలోనే రికార్డు సాధించేలా 70 మిలియన్ టన్నులకు చేరుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.


బొగ్గు రవాణా

మరింత వృద్ధి సాధిస్తాం



సరకు రవాణా విషయంలో రికార్డు స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉంది. ఇది వాల్తేరు డివిజన్‌లో ఉన్న ప్రతి ఒక్క ఉద్యోగి కృషికి దక్కిన ఫలితం. ప్రయాణికుల మౌలిక సదుపాయాల విషయంలో గానీ, సరకు రవాణా విషయంలోనూ డివిజన్ ఎక్కడా రాజీపడటం లేదు. ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నాం. నిర్దేశించిన సమయానికి ఆయా సంస్థలకు సరుకు లోడింగ్ చేస్తుండటంతో డివిజన్‌పై విశ్వాసం పెరుగుతోంది. రాబోయే రోజుల్లోనూ మరిన్ని రికార్డులు సొంతం చేసుకునే దిశగా.. ప్రతి ఒక్క ఉద్యోగి అంకిత భావంతో పనిచేస్తున్నారు.

– అనూప్‌కుమార్ సత్పతి, వాల్తేరు డీఆర్ఎం

డివిజన్ పరిధిలో లోడింగ్ ఇలా...

2020–21 ఆర్థిక సంవత్సరంలో – 61.17 మిలియన్ టన్నులు
2021–22లో – 66.88 మిలియన్ టన్నులు
2022–23లో– 66.92 మిలియన్ టన్నులు

2022–23లో ఇప్పటి వరకూ జరిగిన సరకు రవాణా వివరాలు

బొగ్గు	– 25.42 మిలియన్ టన్నులు
ఐరెన్ ఓర్	– 17.63 మి.ట.
బాక్సైట్	– 5.75 మి.ట.
అల్యూమినా పౌడర్	– 3.6 మి.ట.
ఫెర్టిలైజర్స్	– 2.91 మి.ట.
ఐరన్ అండ్ స్టీల్	– 2.43 మి.ట.
పోల్	– 1.51 మి.ట.
కంటైనర్లు	– 1.37 మి.ట.
ఇతర సరకులు	– 6.3 మి.ట.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి కుంకుమార్చనలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉగాది పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణల ఆధ్వర్యంలో అమ్మవారిని అలంకరించి పూజా కార్యక్రమాలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని, పూజల్లో పాల్గొన్నారు.

ఉత్సవ పల్లకి బహూకరణ



గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి అందించిన పల్లకీతో దాతలు

కశింకోట : స్థానిక గవరపేట వేంకటేశ్వర స్వామి ఆలయానికి ఉత్సవ పల్లకీని భక్తులు బహూకరించారు. ఆళ్ల త్రినాథ్ జ్ఞాపకార్థం భార్య నూకరత్నం, కుటుంబ సభ్యులు దీన్ని బుధవారం అందజేశారు. ఇక్కడి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏటా వైకుంఠ ఏకాదశి రోజున కల్యాణోత్సవం, రామాలయంలో శ్రీరామనవమి రోజు సీతారామ కల్యాణోత్సవం భారీగా జరుగుతాయి. ఆయా రోజుల్లో ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగిస్తారు. ఈ ఉత్సవాలకు కోసం ఉపయోగపడేలా దీన్ని రూపొందించి, అందించినట్లు దాతలు తెలిపారు.

చిల్డ్రన్స్ హోంలో అన్నదానం



దయ చిల్డ్రన్స్ హోమ్‌లో అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

అనకాపల్లిటౌన్ : అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని ఆలిండియా ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ట్రస్టు అనకాపల్లి జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాలతి షణ్ముఖ్ అన్నారు. మండలంలోని వెంకుపాలెంలో ఉన్న దయ చిల్డ్రన్స్ హోమ్‌లో బుధవారం చిన్నారులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రస్టు వ్యవస్థాపకులు పి.డి.సుందరరావు పిలుపు మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లక్ష్మీశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కరుణప్రియ, సహాయ కార్యదర్శి సలోమి ఇమాన్యుయేల్, కోశాధికారి సూర్యకళ వెంకట్, బైబిల్ ఓపెన్ యూనివర్సిటీ లెక్చరర్ ఎ.ధరణి పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
మనసిస్తావా	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-6 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా బుధవారం 217 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 305 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

'అప్‌డేట్' కాకుంటే.. 'ఆధార'ం లేనట్టే

- ఆధార్ కార్డు అప్‌డేట్ గడువు జూన్ 14
- ఆన్‌లైన్‌లో ఆధార్ అప్‌డేట్ ఉచితం
- సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలు



సచివాలయంలో ఆధార్ అప్‌డేట్ చేస్తున్న సిబ్బంది

తుమ్మపాల: మీరు ఆధార్ కార్డు పొంది పదేళ్లు గడిచాయా.. అయితే వెంటనే ఆధార్ అప్‌డేట్ చేసుకోండి. లేదంటే ఆగస్టు నెలతో మీ ఆధార్ కార్డు పనికారాకుండా పోతుంది. అదే జరిగితే పరిస్థితేంటో.. ఒకసారి ఆలోచించుకోండి. ప్రస్తుతం మన బతుకులన్నీ ఆధార్‌కార్డు మీదే ఆధారపడి ఉన్నాయి. బ్యాంకింగ్ సేవలతోపాటు, ప్రభుత్వాలిచ్చే సంక్షేమ పథకాలు, దైనందిన కార్యకలాపాలన్నింటికీ ఇక్కట్లు తప్పవు. అందుకే తక్షణమే మీ ఆధార్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం కోరుతోంది.

ఉచితంగానే ఆధార్ అప్‌డేట్

ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాల చుట్టూ రోజుల తరబడి తిరగక్కర్లేదు. ఈ ప్రక్రియను ప్రభుత్వం సులభతరం చేసింది. ఈ నెల 15 నుంచి, జూన్ 14 వరకు.. మూడు నెలల పాటు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు. మీ ఇంట్లో ఉన్న కంప్యూటర్లో వెబ్‌సైట్ ద్వారా లేదా.. మొబైల్‌లో ఎంఆధార్ యాప్‌లోనైనా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. దీనికి ఎలాంటి రుసుములు చెల్లించక్కర్లేదు. అరచేతిలోనే ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం అందించింది. బ్యాంకులు, కామన్ సర్వీస్ కేంద్రాలు, సచివాలయాల్లో నిర్ణీత ఫీజుతో కూడా ఆధార్ ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నారు.

ఆధార్ కార్డు గడువు ఆగస్టు 31

2010 నుంచి 2016 మధ్య కాలంలో ఆధార్ కార్డు పొందిన వాళ్లు తమ ఆధార్ వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్ కార్డు నమోదు సమయంలో కొన్నిసార్లు వ్యక్తిగత వివరాలున్న ధ్రువపత్రాలు సమర్పించకపోయినా కేవలం ఒక అప్లికేషన్‌తో ఆధార్ మంజూరు చేశారు. అలాంటి వారు తప్పకుండా తమ గుర్తింపు పత్రాలు, ఇతర ధ్రువపత్రాలను ఆధార్‌కు జతచేసి, దాక్యుమెంట్ అప్‌డేషన్ చేసుకోవాలి. అలా అప్‌డేట్ చేసుకోని కార్డుల్ని ఈ ఏడాది ఆగస్టు 31తర్వాత చెల్లుబాటులో లేకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

మార్పులు, చేర్పులకు అవకాశం

ప్రస్తుత అప్‌డేషన్లో భాగంగా ఆధార్లో మార్పులు, చేర్పులకు కూడా అవకాశం ఉంది. చిరునామా, ఫోన్ నంబర్ తదితర వివరాలను మార్చుకోవచ్చు. ప్రభుత్వం ఆమోదించిన పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ, పాన్‌కార్డు, బ్యాంక్/పోస్టల్ పాస్‌బుక్, ఫొటోతో కూడిన రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ/ఆయుష్మాన్ భారత్ కార్డు, గుర్తింపు పొందిన విద్యా సంస్థలు జారీ చేసే పత్రాలు, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు కార్డులు తదితర 13 రకాల ధ్రువపత్రాల ద్వారా ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకోవచ్చు.

సచివాలయాల్లోనూ ఆధార్ అప్‌డేట్



ప్రతి ఒక్కరూ తమ ఆధార్‌ను తప్పనిసరిగా అప్‌డేట్ చేసుకోవాలి. ఆధార్ పొందిన పదేళ్ల వ్యవధిలో ఎప్పుడైనా ఆధార్ డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకుంటే.. అలాంటి వారికి పర్లేదు. పదేళ్లలో ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోని వారికి మాత్రం తప్పనిసరి. ఇలాంటి వారి కోసం మండలంలో ఆధార్ కిట్లు వచ్చిన 12 సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తున్నాం. వీటి సాయంతో అన్ని సచివాలయాలకూ ఈ ఆధార్ శిబిరాలను విస్తరిస్తాం.

– కె.ధర్మారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో, అనకాపల్లి

లోతట్టు ప్రాంతాలు జలమయం



చెరువును తలపిస్తున్న నర్సింగరావుపేట సాయిబాబా ఆలయం వెనుకవీధి

- చెరువుల్ని తలపించిన రహదారులు
- పొంగి ప్రవహించిన దొంగ గెడ్డ



దేవీనగర్, మూలపేట రహదారికి అడ్డంగా ప్రవహిస్తున్న దొంగగెడ్డ నీరు

అనకాపల్లిటౌన్ : గత కొన్ని రోజులుగా వాతావరణంలో ఏర్పడిన మార్పులతో కురుస్తున్న వర్షాలు బుధవారం కూడా కొనసాగాయి. సాయంత్రం 4 గంటలకు భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. విద్యుత్ సరఫరాకు స్వల్ప అంతరాయం ఏర్పడింది. లోతట్టు ప్రాంతాలైన బర్మాకాలనీ, ఏఎంసీకాలనీ, నర్సింగరావుపేట సాయిబాబా ఆలయం వెనుకవీధి, గవరపాలెం పరమేశ్వరిపార్కు జంక్షన్, జీవీఎంసీ జోనల్ కార్యాలయం రహదారి, పూడిమడక రహదారులు చెరువులను తలపించాయి. ఆయా రహదారులపై రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని పలు వీధుల్లో డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. రహదారులు మురుగునీటితో నిండిపోయాయి. అనకాపల్లి-చోడవరం రహదారిలో విజయరామరాజుపేట రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచి, భారీ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ పోలీసులు లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. బ్రిడ్జికిరువైపులా ఉన్న సబ్‌వేలలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలో ఉన్న దొంగగెడ్డ పొంగిపొర్లడంతో దేవీనగర్, సత్యనారాయణపురం, మూలపేట ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఆలయ ముఖద్వారంపై విగ్రహాల ప్రతిష్ట



పూజలు చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు



ఆలయ ముఖద్వారంపై ఏర్పాటు చేసిన విగ్రహాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక కాశీవిశ్వేశ్వరాలయం ముఖద్వారంపై బుధవారం పార్వతీపరమేశ్వరులు, వినాయక, కుమారస్వామి విగ్రహప్రతిష్టాపన జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బుద్ద కిరణ్‌కుమార్ దంపతుల ఆర్థిక సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాలకు 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి, రమేష్ దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు తాడికొండ కుటుంబసభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన



పొలంలో చేరిన వర్షపు నీరు

కశింకోట : కశింకోట ప్రాంతంలో బుధవారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి మండుటెండలతో అల్లాడిన జనం.. సాయంత్రానికి ఆకాశంలో దట్టంగా మబ్బులు కమ్ముకుని మోస్తరు వర్షం కురిసింది. వాతావరణం చల్లబడింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


పేదలకు భోజన ప్యాకెట్ల వితరణ



పేదలకు అన్నదానం చేస్తున్న వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక నెహ్రూచౌక్ కూడలిలో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది పండగను పురస్కరించుకొని బుధవారం పేదలకు భోజన ప్యాకెట్ల వితరణ చేశారు. అసోసియేషన్ కార్యదర్శి శేఖరమంత్రి సాయి వెంకట లక్ష్మణరావు మాట్లాడుతూ వివేకానందుని ఆశయాలకనుగుణంగా తమ అసోసియేషన్ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రాంజీ, బాలాజీ, దివ్యాంగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వీరుయాదవ్ పాల్గొన్నారు.

లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



దేవీపురంలో పూజలు అందుకున్న లలితాంబిక

సబ్బవరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి క్షేత్రంలో లలితాంబికా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ యంత్ర మహామేరు ఆలయం ముందు గోపూజతో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం శ్రీమేరు మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కలశాలను వేదమంత్రాల సహితంగా ప్రాణ ప్రతిష్ఠ గావించి, లలితాంబికా అమ్మవారిని భక్తులు తోడ్కొనివచ్చి నవయోని రేఖాచిత్రం మధ్యలో అధిష్టింపజేశారు. అనంతరం అమ్మవారికి క్షీరాభిషేకం, ఖడ్గమాల, సహస్రనామ కుంకుమార్చనలు నిర్వహించారు. గణపతి సహిత బాల హోమం జరిపారు. కార్యక్రమంలో ఆస్ట్రేలియా నుంచి వచ్చిన ప్రేమ్‌చంద్ మీనన్, పూణే నుంచి వచ్చిన పూనం ప్రధాన్, ముంబై నుంచి వచ్చిన అర్చన ఆర్యతోపాటు స్థానిక భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా గాటీరత్నం పేరంటాలమ్మ తీర్థం



అనకాపల్లిటౌన్ : మండలంలోని భట్లపూడి గ్రామంలో గాటీ రత్నం పేరంటాలమ్మవారి తీర్థమహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారి ఆలయానికి హాజరై ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. సాయంత్రం అమ్మవారి తీర్థమహోత్సవంలో రంగులరాట్నం, ఆకాశచక్రం ఎక్కి చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా ఉత్సాహంగా గడిపారు. తినుబండారాలు, గృహోపకరణాలు తీర్థప్రియులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముమ్మిన అప్పలనాయుడు, గొలగాం సర్పంచ్ ఎస్.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో వీధిలైట్ల ఏర్పాటు



వీధి లైట్లను ప్రారంభించిన నాయకులు

పరవాడ : స్థానిక జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ వీధి లైట్లను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న వారికి ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం కల్పించిన మౌలిక సదుపాయాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.రామారావు, సీనియర్ నాయకులు పైల హరీష్, పైల పైడంనాయుడు, సన్యాసినాయుడు, లైన్‌మెన్ బండారు శ్రీను పాల్గొన్నారు.

పైడమ్మ బంద ఆయకట్టు రైతులకు తీపి కబురు



వ్యవసాయ బోరు నిర్మాణ పనులను ప్రారంభించిన సర్పంచ్ అప్పలనాయుడు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని లుపిన్ ఫార్మా యాజమాన్యం సౌజన్యంతో పరవాడ పైడమ్మ బందలో ఏర్పాటు చేయనున్న బోరు నిర్మాణ పనులను సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు బుధవారం ప్రారంభించారు. పైడమ్మ బంద ఆయకట్టు రైతులు పంటలకు నీరందక పదుల ఎకరాల విస్తీర్ణంలో పంటలు నష్టపోతున్నారు. ఈ విషయాన్ని పొలంబడి కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన వ్యవసాయాధికారుల దృష్టికి రైతులు తీసుకువెళ్లారు. అధికారులు సమస్యను లుపిన్ ఫార్మా యాజమాన్యానికి వివరించారు.

స్పందించిన లుపిన్ ఫార్మా యాజమాన్యం సీఎస్సార్ నిధుల నుంచి ఆయకట్టు రైతులు సాగు చేస్తున్న పైడమ్మ బందలో వ్యవసాయ బోరు నిర్మించడానికి వీలుగా రూ.1.95 లక్షలు మంజూరు చేశారు. వర్క్ ఆర్డర్ ప్రతులను పరిశ్రమ సీఎస్సార్ మేనేజర్ దక్కిన వెంకటనారాయణ బుధవారం రైతు ప్రతినిధులకు అందజేశారు. దీంతో పనులు ప్రారంభించారు. వార్డు సభ్యుడు సిరపరపు రాజేష్, పైడి బంద చెరువు ఆయకట్టు రైతు సంఘ అధ్యక్షుడు గండి నమో, మిల్క్ సొసైటీ అధ్యక్షుడు కె.చినబాబు, రైతులు ఎస్.ఎస్.నాయుడు, ఎస్.సన్యాసినాయుడు, పైల మురళి, ఎస్.సన్యాసినాయుడు, కె.ప్రభాకర్ పాల్గొన్నారు.

దుర్గమాంబ ఆలయ ప్రతిష్ట నేడు



బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమాంబ ఆలయం

పరవాడ : ఇ.బోనంగి శివారు బొద్దపువానిపాలెంలో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమాంబ ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గురువారం ఉదయం 9.57 గంటలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామని సర్పంచ్ బొద్దపు శ్రీనివాసరావు చెప్పారు. కార్యక్రమంలో పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

ఊరూ వాడా ఉగాది శోభ



ప్రత్యేక అలంకరణలో సతకంపట్టు కనకదుర్గమ్మ

- ప్రత్యేక అలంకరణలో తాకాశి నూకాంబిక
- పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



నరసింగబిల్లి నూకాంబిక ఆలయ దర్శనం సందర్భంగా దాడి రత్నాకర్‌కు సంప్రదాయ సత్కారం

అనకాపల్లిటౌన్ : స్థానిక తాకాశివీధి నూకాంబిక ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలు నేత్రపర్వంగా జరిగాయి. ఆలయానికి అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. సాయంత్రం 3 గంటలకు అర్చకులు పంచాంగ పఠనం చేశారు. 12 రాశులవారు ఈ ఏడాది తమకు ఎలా ఉందో అర్చకులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్, కమిటీ సభ్యులు తాకాశి సూర్యారావు, తాకాశి కొండలరావు, బేతి ఈశ్వరరావు, తాకాశి కృష్ణ, తాకాశి నాగేష్, తాకాశి విస్సు, తాకాశి సత్యందొర, గంగుపాం మహేష్‌దొర, కారుకుండి కన్నా, భక్తులు పాల్గొన్నారు.

- గవరపాలెం సతకంపట్టు కనకదుర్గమ్మ ఆలయంలో ఉగాది వేడుకల్లో భాగంగా అమ్మవారికి తెల్లపూలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. అర్చకులు పంచాంగంలో రాశి ఫలాలను వినిపించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు పి.వి.రమణ, ఆలయ చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, పొలిమేర శ్రీను పాల్గొన్నారు.
- వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరుడు, గణపతి, షిర్డీ సాయిబాబా, కన్యకాపరమేశ్వరి, సిద్ధిలింగేశ్వరుడు, సాంబశివుడు, రామలింగేశ్వరుడు, భోగలింగేశ్వరుడు, రామపంచాయతన, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో ఉగాది వేడుకలను పురస్కరించుకుని అర్చకులు పంచాంగ పఠనం చేశారు.

కశింకోట : మండలంలోని పలు ఆలయాల్లో బుధవారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కశింకోటలోని నూకాంబిక ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ రూపాల్లో అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంటరీ పరిశీలకుడు దాడి రత్నాకర్ అమ్మ వారిని దర్శించుకుని, పూజలు చేశారు. ఆలయం వద్ద బాణసంచా కాల్చారు. అమ్మవారి ఉత్సవ ఊరేగింపు సందర్భంగా మంగళవారం రాత్రి స్థానిక రిక్షా స్టాండ్ వద్ద నుంచి సంతబయల పాల కేంద్రం, ఉప్పునీటి దిబ్బ, కస్పావీధి, హౌసింగ్ కాలనీల మీదుగా ఆలయం వరకు ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా అమ్మవారి గరగ, పాదాలకు భక్తులు పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త వేగి శివగణేష్, కార్య నిర్వాహకుడు వేగి దేవత కృష్ణలకు దారి పొడవునా బిందెలతో నీళ్లు పోసి స్వాగతించారు.





కశింకోటలో నూకాంబిక అమ్మ వారి గరగలు, పాదాల ఊరేగింపు

- మండలంలోని నరసింగబిల్లిలో నూకాంబిక అమ్మవారిని దాడి రత్నాకర్ దర్శించుకుని, ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో సర్పంచ్ కోన అరుణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కోన వీర వెంకటసత్యనారాయణ, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కోన నాగేశ్వరరావులు దుశ్శాలువా కప్పి, జ్ఞాపికతో సత్కరించారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు వేగి దొరబాబు ఆయన వెంట ఉన్నారు. ఉగాది ఉత్సవంలో భాగంగా స్థానికుల నేల వేషాలు కనువిందు చేశాయి.
- ఉగ్గినపాలెంలో నూకాంబిక ఉత్సవంలో రాత్రి పెద్ద ఎత్తున బాణ సంచా కాల్చారు. బాణసంచా విన్యాసాలు ఆహుతులను అలరించాయి.
- ఉగాది పురస్కరించుకొని కశింకోటలోని గవరపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరం, లక్ష్మీనృసింహస్వామి తదితర ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు

కశింకోటలోని గవరపేట, కస్పావీధి, పూసర్ల వీధి, కనకమహాలక్ష్మి వీధి రామాలయాల్లో పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఎస్.ధనబాబు, ఎన్.శర్మ తదితరులు రాశి ఫలాలు, ఈ ఏడాది వర్షాల పరిస్థితి, పండే పంటలు తదితర అంశాల గురించి పంచాంగం రీత్యా వివరించారు. రైతులు, ప్రజలు ఆయా ఆలయాలకు చేరి ఆసక్తిగా విన్నారు.

వీరబ్రహ్మం ఆలయంలో ప్రత్యేక పూజలు



సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి దంపతులను సత్కరించిన గ్రామ పెద్దలు

అనకాపల్లి రూరల్ : మండలంలోని సత్యనారాయణపురంలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. రూ.3 లక్షలతో చేపట్టిన ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తికావడంతో ఉగాది పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసంతర్పణలో దాదాపు 800 మంది పాల్గొని, అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులిచ్చిన సర్పంచ్ పలకా భాగ్యలక్ష్మి, సత్తిబాబు దంపతులను గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

నేడు అన్నపూర్ణమ్మ విగ్రహ ప్రతిష్ట

అనకాపల్లిటౌన్ : మండలంలోని భట్లపూడి పంచాయతీ నాయుడుపేట సోహం ఆశ్రమంలో గురువారం అన్నపూర్ణమ్మ విగ్రహ ప్రతిష్టాపన జరపనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు రవి బుధవారం తెలిపారు. విగ్రహ ప్రతిష్ట వేడుకలో భాగంగా అదేరోజు ఉదయం పంచామృతాభిషేకం, హోమం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు.